# 4

# రంగన్న

పార్వతీశంగారు పోయిన మూడోరోజు బుధవారం విమానం దిగాడు ఆయన ఒక్కగానొక్క కొడుకు మోహన్ అమెరికానించి. ఆయనకేమో చెప్పుకోతగ్గ బంధుబలగం ఏమీ లేదు. ఉన్న కొద్దిమంది బంధువులూ ఎక్కడెక్కడో దూరపు ఊళ్ళల్లో ఉన్నారు. రాక పోకల్లేవు. ఉన్న ఒక్కగానొక్క కావల్సినవాడు... ఇష్టుడూ... సేవకుడు... ఆప్తబంధువు... మిత్రుడూ లాంటి వాడు అన్నీ రంగన్నే.

ఈయనకి ఏనాడో చిన్న వయసులో... కుర్రాడిగా పన్లు చెయ్యడానికి ఆ ఇంట్లో ప్రవేశించాడు. ఎవ్వరూ లేని అనాథ రంగడు. ఇంట్లో పన్లూ, బయట పన్లూ అన్నీ ఏ లోటూ రాకుండా బాధ్యతగా చేసుకుపోతూ... ఇంక తనకి వేరే జీవితం అక్కర్లేదన్నట్టే ఉండేవాడు. రంగడు కాస్తా రంగన్న అయ్యాడు. అమ్మగారూ అయ్యగారూ నచ్చచెప్పి ఒప్పించగా పెళ్ళి చేసుకోడానికి సమ్మతించాడు. తనకి నచ్చిన పిల్లనే చేసుకున్నాడు. కానీ ఆ చేసుకున్న పిల్ల ఏడాది తిరక్కుండానే ఇల్లొదిలి వెళ్ళిపోయింది. జాడ తెలియలేదు. పార్వతీశంగారెంతో నచ్చచెప్పాలని చూసినా మళ్ళీ పెళ్ళిమాట తలపెట్టలేదు రంగన్న. ఉండేదిక్కడే. తినేది ఇక్కడే. పార్వతీశంగారికి నమ్మినబంటు అయ్యాడు. మోహన్ అమెరికా వెళ్ళడం... అక్కడ నచ్చిన పిల్లని అక్కడే పెళ్ళి చేసుకుని అమెరికాలోనే స్థిరపడిపోవడం... ఆ తర్వాత కొద్దిరోజులకే పార్వతీశంగారికి అకస్మాత్తుగా సతీవియోగం... అన్నీ ఓ సినిమా రీలులా జరిగిపోయాయి. ఇంట్లో మనిషిలా రంగన్న తోడు ఉన్నాడు కాబట్టి తండ్రిని గురించిన దిగులే లేదు మోహన్‌కి. నెలకింతని డబ్బు పంపడమే తప్ప మరే బాధ్యతా పెట్టుకోలేదతను. పార్వతీశంగారికి రంగన్న... రంగన్నకి పార్వతీశంగారు కబర్లు చెప్పుకున్నా కథలు చెప్పుకున్నా...

ఒకరికొకరు ధైర్యం చెప్పుకున్నా... మనసుకి ఊరట కలిగించే మాటలు చెప్పుకున్నా అన్నీ వాళ్ళిద్దరే ఒకరికొకరు. భార్యపోయిన కొత్తలోనే పక్షవాతం వచ్చి కుడిచెయ్యి, కుడి కాలూ శాశ్వతంగా పనిచెయ్యడం మానేసిన పార్వతీశంగారికి కాళ్ళూ చేతులూ తానే అయ్యాడు రంగన్న పాతిక సంవత్సరాలుగా. ఏదో రోజులిలా గడిచిపోతున్నాయిలే అనుకుంటుంటే హఠాత్తుగా అయ్యగారి గుండె కొట్టుకోవడం ఆగిపోతే పిచ్చి చూపులు చూశాడు. తన గుండె తీసి ఆయనకి పెట్టమని డాక్టర్‌గారి కాళ్ళు పట్టుకుని ఏడ్చాడు. ఆ దృశ్యం చూసి కంట తడిపెట్టని ఇరుగుపొరుగు లేరక్కడ. ఎవరో పూనుకుని మోహన్‌కి ఫోన్ చేసి విషయం చెప్పారు. తనొచ్చేవరకూ ఐస్‌పెట్టెలో పెట్టి ఇంట్లోనే ఉంచమని వాళ్ళని కోరాడు మోహన్. విమానాశ్రయం నుంచి అతను రావడమే తడవు ఏర్పాట్లు చకచకా మొదలు పెట్టారు నలుగురూ చేరి.

కుమిలి కుమిలి ఏడుస్తున్న రంగన్నని చూస్తుంటే మోహన్ మనసులో ఎక్కడో కలుక్కుమంది. తండ్రిపోయినందుకు తనకి బాధగానే ఉన్నా పెద్ద వయసే కదా అన్న ఆలోచన దుఃఖాన్ని దిగమింగేస్తోంది. పైగా ఇండియాలో తనకున్న ఈ ఒక్క బాధ్యతా తీరిపోయిందిలే అని ఉపశమనంగా తాను భావించడం మనసుని ముల్లులా గుచ్చింది రంగన్నని చూస్తుంటే. తను, తన భార్య, పిల్లలు తన తండ్రికి పరాయివాళ్ళేగా అనిపించి కళ్ళల్లో నీళ్ళు నిలిచాయి. మరుక్షణం అనిపించింది... కన్నకొడుకు తనే ఆయన్ని పట్టించుకోనప్పుడు తన భార్యాపిల్లలకి ఎందుకు పడుతుంది? మనసుతో సంబంధం లేదు తనకి మనీతోనే. ఆ మనీ ఆయనకి పంపుతున్నానన్న గర్వం మానవ సంబంధాలని మరుగుపరిచింది.

హంస ఎగిరిపోయిన పార్వతీశంగారి శరీరాన్ని ఇంట్లోంచి బయటికి తీసుకొచ్చారు.

"స్నానం చేయించాలి".


ఏడుస్తున్న రంగన్నకి వినపడిందామాట. చటుక్కున లేచాడు. ఎవరో అడ్డుకున్నారు.

"నువ్వు నీళ్ళు పొయ్యకూడదు రంగన్నా" మృదువుగానే చెప్పారు.

"ఏంబాబూ?" మాటా చెయ్యీ వణికాయి. "ఆయన యజమాని... నువ్వీ ఇంట్లో...పనివాడివి" పక్కగా వెళ్ళి మొదలు నరికిన చెట్టల్లే కూలబడ్డాడు రంగన్న.

"పాతికేళ్ళుగా ఈ చేతుల్తో అయ్యగారికి స్నానం చేయిస్తున్నాను. ఇన్నేళ్ళూ పనికొచ్చిన నేను ఇప్పుడు అయ్యగారు నన్నొదిలి వెళ్ళిపోయేటప్పుడు ఆఖరి సారిగా స్నానం చేయించడానికి నాకు అనుమతి లేదా బాబూ?" విలవిలలాడిపోతున్న రంగన్నని కన్నార్పకుండా చూశాడు మోహన్. కారణం... అతని ప్రశ్న సూటిగా హృదయాన్ని తాకింది. దగ్గరగా వెళ్ళి రంగన్నని లేవదీసి మెల్లిగా తండ్రి శవంవైపు నడిపించు కెళ్ళాడు.

అక్కడున్న అందరూ ఆశ్చర్యంగా చూస్తుండిపోయారు.



'నది' పత్రిక నిర్వహించిన పోట్టి కథల పోటీలో ఉత్తమ కథగా ఎన్నికైన 'రంగన్న' కథకుగాను రచయిత్రి తమిరిశ జానకిగారు, గోవిందరాజు సీతాదేవి రూ॥5000/-నగదు పురస్కారాన్ని నది మేనేజింగ్ ఎడిటర్ శ్రీ సీతారాం అవ్వాస్ నుంచి అందుకుంటున్న దృశ్యం.